# కొండంత చీకట్లో గోరంత దీపం

— వేదుల శకుంతల



"అందుచేత నేను మీ అందరికీ మరొకసారి మనవి చేసేదేమంటే— ఈనాడు మనం, సమాజంలో అనేక సమస్యల్ని ఎదుర్కొంటున్నాం. ఓ మూల వరకట్నం, మరొక పక్క లంచగొండితనం, నిరుద్యోగం, జనాభా పెరుగుదల, అధిక ధరలు, రాజకీయ అల్లర్లు, మత కలహాలు ఎప్పుడూ ఏదో ఒకచోట, నిరాహారదీక్ష శిబిరాలు, ఉద్యమాలు, ఊరేగింపులు, హత్యలు లేక ఆత్మహత్యలు, దోపిడీలు, మానభంగాలు ఇలా ఇలా ఎన్నెన్నో? మనం రోజు చూస్తున్న, వింటున్న దారుణాలు మీకందరికీ తెలుసు! ఇటువంటి క్లిష్టపరిస్థితుల నుంచి మనం బయటపడి సమాజాన్ని సురక్షితం చేయాలంటే దేశాన్ని సుభిక్షం చేయాలంటే మనమంతా కార్యదీక్షాపరులమై దృఢ సంకల్పంతో ముందుకు దూకాలి! సంఘసేవా కార్యక్రమానికి నడుం కట్టాలి. ఉడుతాభక్తిగా మనకున్నంతలో, చేయగలిగినంత సహాయ కార్యక్రమాల్ని చేపట్టాలి! అందుకే ఈ 'సేవాసంఘ్' స్థాపించటం జరిగింది. ఈ ఆరునెలల కాలంలోనే మనం ఎన్నో అభ్యుదయ కార్యక్రమాలు చేసేము. నిజమే! కానీ, అదెంతమాత్రం? దేశం ఈనాడు కొండంత చీకట్లో మునిగిపోతోంది! అంధకార బంధురమైపోతోంది! ఒకరినొకరు తెలుసుకోలేని ఈ కటిక చీకట్లో ఎవర్ని ఎవరు పొడుచుకుంటారో? ఎవర్ని ఎవరు మింగుతారో?....అందుకే ఈ అక్రమాల్ని అరికట్టాలి. దీపాలు వెలిగించాలి. ఒకటి, రెండు కాదు వందలు, వేలు! నలుమూలలా దీపాల తోరణాలు వెలిగించాలి! ఈ చీకటిని పటాపంచలు చేయాలి! పట్టపగలు సూర్యుని తేజస్సులా సమాజం శాంతియుతం కావాలి!

"అందుకే - మనం ప్రగతిపథంలోకి పయనిద్దాం! మరింత పట్టుదలతో - అభ్యుదయ కార్యక్రమాల్ని చేపట్టాం! మరి ప్రముఖులైన వక్తలు ఎందరో వున్నారు. వారి అమూల్యమైన సందేశాలని మనమంతా విందాం! కనుక ఇంతటితో నా ప్రసంగాన్ని నిలిపివేస్తూ— మీరంతా దేశసేవకి ముందుకు రావాలని మరీ మరీ విన్నవిస్తూ - సెలవు తీసుకుంటున్నాను."

హాలంతా చప్పట్లతో మారుమ్రోగిపోయింది!

నలభై ఐదు నిమిషాలు అనర్గళంగా ఉపన్యసించిన గౌరవనీయులు శ్రీ రాజభూషణచక్రవర్తి గారి చివరి వాక్యాలు అవి! ప్రేక్షకులు ఎంత ఉత్తేజితులయ్యారో ప్రత్యక్ష సాక్ష్యమే ఆ కరతాళ ధ్వనుల మ్రోత!

గాజు గ్లాసులో మూడోవంతు నీళ్ళు తాగేక సీట్లో కూర్చుని ఆయాసం తీర్చుకున్నారు! ప్రక్కనున్న అధ్యక్షులవారు తరువాత వక్తని ప్రసంగించవలసిందిగా కోరేక, చిరునవ్వుతో రాజభూషణ చక్రవర్తిగారి చేయి ప్రశంసాపూర్వకంగా పట్టుకుని తలాడించేరు.

గంటన్నర తరువాత రెండుమూడుసార్లు చప్పట్లు హోరున కురిసేక సభ ముగిసింది!

మర్నాడు దినపత్రికల్లో ఫోటోలు, వ్యాఖ్యలు బాక్సులు కట్టి మరీ అచ్చువేసేరు.

దేశంలో ఈలాంటి 'సేవాసంఘ్'లు ఎన్నెన్నో వెలవాలనీ వాటి అవసరం ఈనాడు ఎంతో వుందన్న అభిప్రాయాన్ని ప్రత్యేకించి రాసేరు విలేకర్లు!

ఆఫీసురూములో కాఫీ తాగుతూ పేపరు చూస్తున్నారు రాజభూషణ చక్రవర్తిగారు. ఆయన కనులముందు ఆ ఆఖరి వాక్యాలకి అనుగుణమైన రూపకల్పన అలవోకగా కదలుతోంది.... పెద్ద ఇనుపచువ్వలున్న గేట్లు, లోపల పెద్ద ఆవరణ, రకరకాల చెట్లు, దూరంగా ఓ భవంతి! అందులో ఎందరెందరో శరణార్థులు! అనాధలు, దీనులు, వృద్ధులు, బాధాతప్త హృదయులు...కానీ వాళ్ళంతా ఎంతో ఆనందంగా తిరుగుతూ వుంటారు. ఎవరికి నిర్ణయించిన పనులు వాళ్ళు చేసుకుంటూ వుంటారు. అభయ హస్తం క్రింద అరమోడ్పు కన్నులతో సేద తీర్చుకుంటున్నట్లు వారి వదనాల్లో సంతృప్తి తాండవిస్తూ వుంటుంది!

అలాంటి శుభోదయాన్ని చూడాలి. ఆ బృహత్తర కార్యదీక్షకి పూనుకోవాలి! పెద్దలందర్ని కూడగట్టాలి! అవును....అవును....అనుకుంటూ, రాజభూషణచక్రవర్తిగారు దీర్ఘంగా నిశ్వసించి పేపరు పేజీ తిప్పేరు.

పెరట్లో తులసికోట దగ్గర వెండికుందుల్లో (ప్రమిదల్లో) వత్తులు వెలిగించి పూజ ముగించిన సౌభాగ్యలక్ష్మి నిలువెత్తు కోటచుట్టూ ముమ్మారు ప్రదక్షిణంచేసి భక్తితో చేతులు జోడించి – "తల్లీ ఎల్లవేళలా మాఇంటి మహాలక్ష్మివై మమ్మల్ని కాపాడుతల్లీ" అంటూ ప్రార్ధించి కళ్ళుతెరచింది.

ఎదురుగా చుట్టుచెంగావి చీరకట్టుకున్నట్టున్న ప్రకృతి ఎంతో అందంగా కనిపించింది. లేలేత ఎండ తూర్పుకొండల్లో పలచగా పరుచుకుని అదొాక అంచులా వుంటే, ఆపైన ఆకాశపురంగు తెల తెల్లగా తేలుతూ చీర పైభాగంలా వుంది.

ప్రతిరోజు ఆమె పూజముగించగానే కనిపించే ఈ కమనీయ దృశ్యం ఆవిడకెంతో ఇష్టం! తనివి తీరా చూస్తుంటుంది.

పూలసజ్జ అందుకుని వెనక్కితిరిగింది. కుడి పక్క పంపుదగ్గర గబగబా అంట్లుతోముతున్న రత్తాలు కనిపించింది. అది తొడుక్కున రవిక గమత్తుగా వుంది. ఓ అడుగు అటు వేసి "ఏమిటే రత్తాలు? రవికేమిటో షోకుషోకుగా కుట్టించు కున్నావ్? ఎక్కడ చూసేవ్ ఈ ఫాషన్?" అంది నవ్వుతూ.

పని ఆపి చేయికడుక్కుని తడి చేత్తో భుజం మీద తడుముకుంటూ – "నాముఖం! పేషనేం దమ్మా? – మా ఇంటికాడ దర్జీవోడు కుట్టి ఇచ్చిండు! అడి పెండ్లానికి చెయ్యి నచ్చుపడ్డ కాణ్ణుంచి ఇంటి పనులు చేసుకోలేకపోతున్నది. అందుకని ఏదో నేను అప్పుడప్పుడు ఆ పని ఈ పని సాయంచేసి పెట్త ఆళ్ళకి! అందుకోన మని ఏదో అడికి తీరిక వున్నప్పుడు ఆడికాడ మిగిలేముక్కలన్ని పోగేసి ఇగో ఇట్ల కుట్టి పెట్టిండు. మా పిల్లకు గౌన్లు కూడ కుట్టిస్తడు. చేయి తిరిగినోడుగదా? అందుకని అతుకులన్నీ మంచిగ చేసి కొత్తరకంగ కుట్టిండు. అందుకే ఇదేదో కొత్తనమూన తీరుగ వుంది. ఏందోనమ్మ. నాకైతే రవిక అమిరింది. వాళ్ళకి కూడా మనసుకు మంచిగ అనిపిస్తదిగదా? ఏదో నాచేత పున్యానికి పని చేపిచ్చుకున్నట్టు గాకుండ బదులు తీర్చుకున్నట్టు అనుకుంటారు." అంటూ క్రాసుగ అతికిన రవిక చేతిని పైకెత్తి చూపించింది, రత్తాలు.

అరనిముషంపాటు ఊహకి అందీ అందని భావమేదో వెతుక్కుంది సౌభాగ్యలక్ష్మి.

ఆ తరువాత లోపలికెళ్ళిపోయింది. "గుడ్ మార్నింగ్ డాడీ" కాఫీ కప్పుతో వచ్చిన మధు తండ్రి కెదురుగా సోఫాలో కూర్చున్నాడు.

పేపర్ మడిచిపెట్టూ – "గుడ్‌మార్నింగ్" అని చిన్నగా నవ్వేరు రాజభూషణ చక్రవర్తిగారు.

"డాడీ నిన్న మీ ఫంక్షన్‌కి మా ప్రిన్సిపాల్ గారు కూడా వచ్చేరు. ఆయన మిమ్మల్ని చాలా మెచ్చుకున్నారు. మీతో మాట్లాడాలనుకున్నారు, కానీ మధ్యలోనే వేరే ఏదో అర్జెంట్ పని గుర్తు వచ్చి తొందరగా వెళ్ళిపోయేరు."

"అలాగా!"

"అవును డాడీ! ఆయన చాలా ఫంక్షన్సుకి వెళ్తూవుంటారుట! నాలైదు అసోసియేషన్సులో మెంబరు కూడా! భలే ఏక్టివ్‌గా వుంటారు."

"ఓహో! అయితే మా 'సేవాసంఘ'లో కూడా మెంబర్‌గా చేర్చుకుంటాం!"

"ఆమాట ఆయనే అన్నారు డాడీ! అందుకే మీతో పర్సనల్‌గా మాట్లాడుతానన్నారు."

"వెరీగుడ్! అలాంటి జెంటిల్‌మెన్‌లందరు ముందుకు వస్తే ఈ 'సేవాసంఘ' ఎంతైనా అభివృద్ధిలోకి వస్తుంది!"

రాజభూషణ చక్రవర్తిగారు కన్నులో కాంతి రేఖలు మెరిసేయి.

"ఏమిటేమిటి తండ్రికొడుకులు అభివృద్ధి పథకాల్లోకి వెళ్ళిపోతున్నారా? కాస్త ఈ ప్రసాదం నోట్లో వేసుకుని...సరే కాఫీ గ్లాసులు నోళ్ళ దగ్గర వుంటే ఇంక ఈ ప్రసాదం ఎలా తింటారు?" అంటూ తుంపబోతున్న అరటిపండు మళ్ళీ చేతిలోనే వుంచుకుంది, అప్పుడే అక్కడికి వచ్చిన సౌభాగ్యలక్ష్మి.

"ఓహ్! మమ్మీ! ప్రసాదాలన్నీ నువ్వు తిను. ప్రగతి పథాల్లో డాడీ ప్రయాణం చేస్తుంటారు." పక్కనున్న పేపర్ అందుకుంటూ, అన్నాడు. "సరేలేరా!" అన్న తల్లి మాటకి వెంటనే పేపర్ విప్పి చూపిస్తూ – "లేకపోతే ఏమిటి మమ్మీ? ఒక్కసారైనా నువ్వు డాడీ ఉపన్యాసం విన్నావా? చూడు ఈ పేపర్లో ఎంత స్పెషల్‌గా వేసేరో? నిన్న ఫంక్షన్ ఎంత గ్రాండుగా జరిగిందో తెలుసా? ఆ సందులో ఎన్ని కార్లు ఆగేయో చూడాల్సిందే. సిటీలో వున్న పెద్దపెద్ద వాళ్ళందరు వచ్చారు. ఆ! మర్చిపోయేను, ఈ వేళ టి. వి లో చూపిస్తారట, చూడాలి మా కాలేజీ."

"ఒరే మధూ స్టుపిట్! అవన్నీ కాదురా చెప్పవలసిందీ, ముందు ముందు మేము అంటే ఈ 'సంఘ' ఏమేమి చేయబోతుందీ ఏ ఏ సేవా కార్యక్రమాలు చేపట్టబోతుందీ, దానివలన ఎంత మంది బాగుపడతారూ? అదీ చెప్పాలి." రాజభూషణ చక్రవర్తిగారు తల పంకిస్తూ మధు మీదుగా చూపులు సౌభాగ్యలక్ష్మిపైన నిలిపేరు.

"ఊ! బాగానే వుంది! మరి అవన్నీ అమల్లో పెట్టాలంటే సాధ్యమా?" అని నవ్వింది. ఎన్నో సార్లు ఆ కార్యక్రమ వివరాలు వింటూనే వుంది.

"అసాధ్యమనుకుంటున్నావా? పిచ్చిదానా! మానవ ప్రయత్నం వుండాలే కానీ సాధ్యపడనిది లేదే! పెద్దలంతా తలొక చేయివేస్తే ఆపైన ప్రభుత్వంవారు కొంత గ్రాంటు ఇస్తే ఇక చెప్పాలా? కాకపోతే ఇది పదిమందీ కలిసి సమిష్టిగా చేయాల్సింది గనుక కొంత సమయం పట్టుంది! ఇవాళే అంటే ఇవాళే కాదు. విత్తు నాటేముగదా? నీరు పోస్తువుంటాం! అది మొలకెత్తి పెరిగి పెద్ద దవుతుంది. మహావృక్షమై వేలాది మందికి నీడ నిస్తుంది! అప్పుడు మనకి ఈనాడు మొదలెట్టిన పనికి సార్ధకత కనిపిస్తుంది!" రాజభూషణ చక్రవర్తి గారి పెదవుల్లో చిరుదరహాసం! కనుచూపుల్లో కన్పించబోయే కృషి ఫలితానికి స్వాగత సూచకంగా కదిలింది. సౌభాగ్యలక్ష్మి బుగ్గన వేలుంచుకుంది. ఇంతలో "మధూ" అని బయటనుంచి ఎవరో పిల్చేరు.

"ఆ!" అని లేచి వరండాలో కెళ్ళేడు మధు.

పనిమనిషి పిలిస్తే సౌభాగ్యలక్ష్మి కూడా లోపలి కెళ్ళిపోయింది. ఒంటరిగా కూర్చున్న రాజభూషణ చక్రవర్తిగార్కి హఠాత్తుగా గుర్తువచ్చింది ఒక పెద్దమనిషిని ఈరోజు ఉదయం పదిగంటల లోపులో, కల్సుకోవాలని! వెంటనే ఆయన లేచి డ్రస్సు వేసుకుని బయటికి వచ్చారు. వరండాలో మధు వాళ్ళ ఫ్రెండ్‌తో మాట్లాడుతున్నాడు.

"నమస్కారం సార్!" అన్నాడు రంగనాథ్, మధు ఫ్రెండ్.

"నమస్కారం బాగున్నావా? ఏమిటిలా పొద్దున్నే వచ్చావ్?"

"అదే! చిన్న పనుండి" నసుగుతూ మధు వైపు చూసేరు నువ్వు చెప్పు అన్నట్టుగా.

"డాడీ మీరు బయటికి వెళ్తున్నారా?"

"అవును అర్జెంటుగ ఓ పెద్దమనిషిని కల్సుకోవాలి."

"సరే! నేను తర్వాత చెప్తాలేరా" అన్నాడు మధు, రంగనాథ్‌వైపు తిరిగి తగ్గు స్వరంలో! "మీరు వెళ్ళండి డాడీ నేను తర్వాత చెప్తాలెండి" అన్నాడు తండ్రివైపు చూసి.

కారు బయటికి తీసి బయటికి వెళ్ళేరు, రాజభూషణ చక్రవర్తిగారు.

నాల్గు మలుపులు తిరిగి మెయిన్‌రోడ్డు మీదకి వచ్చింది కారు. మరి ముందుకు వెళ్ళలేక ఆగిపోయింది. ఉహూ! ఆగిపోవాల్సి వచ్చింది! కారుకి ఏట్రబుల్ రాలేదు!

ట్రాఫిక్ పోలీసు ఆపలేదు! కానీ కారు ఆగాల్సి వచ్చింది కారణం?

ఎదురుగా నీళ్ళ ప్రవాహం!

మడమలే కాదు దగ్గర దగ్గర రెండు జానెల వరకు కాళ్ళు మునిగేటట్టు నీళ్ళు పారుతున్నాయి! నిజానికి అది మెయిన్‌రోడ్డే అయినా సిమెంట్ అంతా పెచ్చులు ఊడి గుంటలు పడి మరమ్మత్తుకు ఎదురుచూస్తూ దీనావస్థలో వుంది! పక్కరోడ్డు నుంచి మెయిన్‌రోడ్డుకి కలిపిన ఒక నీళ్ళపంపు మట్టంతా కొట్టుకుపోవడం చేతనో ఏమో ఇనుప గొట్టం బయటపడి రెండు మూడు చోట్ల తూట్లు పడింది!

ఏ రాత్రో డ్యూటీ మనిషి పంపుతిప్పేసి వెళ్ళిపోయి వుంటాడు. చక్కగా నీళ్ళు ఆ చిల్లుల్లో నుంచి ఫౌంటెన్‌లా చిమ్ముతూ రోడ్డంతా మోజులా పరుచుకుని ఇంకా తనివి తీరక నదిలా ప్రవహిస్తున్నాయి!

అప్పటికే రెండు కార్లు ఓ వాన్ అక్కడ ఆగి వున్నాయి. వాటి యజమానులు డోరులో నుంచి తలలు మాత్రం బయటికి దూర్చి నిర్లక్ష్యంగా డ్యూటీ చేసే వర్కర్స్‌ని మున్సిపార్టీవారినీ తిట్టుకున్నాక మళ్ళీ కారు తలుపుని 'ఢాం' అని వేసుకుని 'ఝూం'మని నీళ్ళని చీల్చుకుంటూ వెళ్ళిపోతుంటే ఇద్దరు సైకిల్ బాబులు గభాల్న కాళ్ళు పెడల్స్ మీద నుంచి పైకి ఎత్తి బాలెన్సు తప్పి మళ్ళీ కంట్రోలు చేసుకుని కార్లవాళ్ళ పొగర్లని తిట్టుకుంటున్నారు.

సరిగ్గా ఆ సమయంలో రాజభూషణ చక్రవర్తిగారు కారు ఆపుకున్నారు.

నీళ్ళవైపు చూసేరు. పక్కన ఆగిన సైకిల్ వాలాల్ని చూసేరు. నీళ్ళన్నీ వృథాగా పోతున్నాయని బాధపడ్డారు. ఎవరైనా రిపోర్టు ఇస్తే బాగుండుననీ అనుకున్నారు. రెండు నిముషాల్లో ఎన్నో అనుకున్నారు. ఆ లోపులో మరో రెండు ఆటోలు ఓ లారీ అంతకు ముందే సైకిల్‌వాళ్ళు వెళ్ళిపోయేరు వెనుక నుంచి పాలవ్యాను 'బోంయ్'మని హారన్ కొట్టేసరికి కారు స్టార్టుచేసి ముందుకు పోనిచ్చేరు.

రెండు గంటల తర్వాత తిరిగి ఇంటికి వస్తున్నప్పుడు—నీటి ప్రవాహం ఆగిపోయింది. రోడ్డంతా తడిగా బురదగా మాత్రమే వుంది. బహుశా వాటర్ వర్కర్స్ వచ్చి వుంటారనుకున్నారు. ఆయన దృష్టి-రోడ్డు పక్కగా వున్న గొట్టం మీద పడింది. సన్నటి కొబ్బరి తాడుతో మూరెడు పొడుగునా గట్టిగా బిగించి వుంది! ఈ పని ఎవరో చేసి వుంటారు – వాటర్ వర్కర్స్ కాదు! అనుకోకుండా కారు స్లో చేసుకుని ఒక్క నిముషం ఆగేసరికి, సందు మొదట్లో గంట క్రితం తెరచిన పాన్ షాపు కుర్రాడు-పరిగెత్తుకుంటూ వచ్చి, "ఏం సార్ సిగరెట్ ప్యాకెట్ కావాలా?" అని అడిగేడు.

కారుబాబులు-దరిదాపులో కారు ఆపుకుంటే, సిగరెట్లకో బిస్కట్ ప్యాకెట్లకో అని పాన్ దుకాణాల వాళ్ళ నమ్మకం!

"ఆహా! వద్దు. ఈ నీళ్ళు ఎలా ఆగేయా – ఎవరు అలా కట్టేరా అని...."

"అదా సార్" వాడు చిన్నగా నవ్వి, ఇందాక ఓ రిక్షావాడు వస్తూ ఆగి నీళ్ళు తాగేడు సార్! ఆ తర్వాత సీటు క్రింద వున్న కొబ్బరితాడు తీసి అదుగో అలా బిగించేడు—'బాబూ రాత్రంతా మా బస్తీలో ఆడకూతుళ్ళు కుండలు, బిందెలు పట్టుకుని నిద్దర్లు మానుకుని, ఆవులించుకుంటు నల్లాలకాడ పడిగాపులు పడ్తా వుంటారుగానీ, ఓ సుక్క నీటిబొట్టు రాదు. మరి ఈడ ఈ తీరున నీళ్ళు పోతావుంటే, ఎవరికీ దక్కట్లేదే అని బాధగా వుంది, అయ్యన్నీ ఊరకేపోకుండా-ఇట్టా పోతుండబట్టే మా బస్తీలో నీళ్ళు వస్తలేవేమో అని కట్టున్నా బాబు'-అని అన్నాడు సార్. ఏదో పిచ్చిమాలోకపోడు మొత్తానికి నీళ్ళు రాకుండా చేసేడులెండి" అన్నాడు.

రాజభూషణచక్రవర్తిగారు ఏం మాట్లాడలేదు. కారు ముందుకు నడిపేరు.

ఇంటికి వచ్చాక స్నానం ముగించి డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చున్నారు.

అప్పటికే మధు కాలేజీకి వెళ్ళిపోయేడు.

భర్తకి దగ్గర వుండి వడ్డిస్తోంది సౌభాగ్యలక్ష్మి.

"చూసేవా సౌభాగ్యం! అన్ని ఎలా సమకూరుతున్నాయో? నేను ఇప్పుడు ఎక్కడికి వెళ్ళేనో తెలుసా? మాకు ఇంతవరకు సరియైన ఆఫీసు బిల్డింగ్ దొరకలేదు. అందుకని ఆ మధ్య అడ్వర్టైజ్ చేసాం! ఓ పెద్దమనిషి-నాల్గురోజుల క్రిందట మా ఛైర్మన్‌గారికి లెటర్ వ్రాసేడు. ఈరోజు పొద్దున్న వచ్చి కల్సుకోమన్నాడు. అందుకని ఆయన దగ్గరకి వెళ్ళేను. చందన్‌లాల్ అని ఓ పెద్ద సేఠ్‌జీ! అతనికో మేడ వుంది. అతను ఎప్పుడూ బొంబాయిలోనే వుంటాట్ట! ఈ మేడ ఇప్పుడు నాల్గు కుటుంబాల వాళ్ళకి అద్దెకిచ్చాట్ట. వాళ్ళతో ఇబ్బందిగా వుందని ఆఫీసులాంటి వాటికైతే-తను బొంబాయిలో వుండే అద్దె వసూలు చేసుకోవచ్చని...అనుకుంటున్నాట్ట! అందుకని రేపటి నెలలో వాళ్ళంతా ఖాళీ చేస్తారుట. మాకిస్తానని మాట ఇచ్చాడు. మిగతా వాళ్ళతో మాట్లాడి, అద్దె సెటిల్ చేసుకోవాలి నేను. కొంచం ఎక్కువే అయినా, మేడైతే మంచి వీలుగా వుంటుంది!"

ఉత్సాహంతో చెప్పుకుపోతున్నారు, రాజభూషణ చక్రవర్తిగారు. మౌనంగా నవ్వుతూ వింటోంది సౌభాగ్యలక్ష్మి.

తామిద్దరికీ గత ఇరవైఏళ్ళగా ఉన్న సాన్నిధ్యం! పెళ్ళైన కొత్తలో హనీమూన్...అందమైన అనుభవాలు...ఆనందాల కేరింతలు. ఆ తర్వాత పెద్దమ్మాయి పుట్టుక, తొందర్లోనే అబ్బాయి జననం...ఆ పిల్లలతో సమంగా పిల్లాడిలా ఈయనగారి అల్లర్లు...గిలిగింతలు, పులకింతలు ఆ పైన ఉద్యోగపు ఊపులో పట్టుదల-ప్రమోషన్లు సంపాదించడం ఆస్థి-అంతస్థులు-వాటితోపాటు పరపతి, హోదా పెరగడం, అమ్మాయికి పెళ్ళి చేయడం, తాత కావడం – ఇలా మెట్లెక్కి వస్తున్నా, చెక్కు చెదరని ఆ ఉత్సాహం...దారుఢ్యం అన్నీ ఆవిడ కళ్ళలో ఆల్బమ్‌లో పేజీల్లా తిరిగిపోతున్నాయి.

ఎప్పుడూ గలగలపారే సెలయేరులా ఒకటే హోరు! ఏదైనా చేయాలనుకుంటే - అది సాధించే వరకు ఊరుకోరు. ఎదురుగా విజయగర్వంలాంటి ధీమాతో వున్న భర్తలోని ఈ కార్యక్రమ దీక్షని

తదేకంగా చూస్తోంది. అయితే గతంలోని ఉద్రేకపు ఉరకలకీ, ఇప్పటి ఉరకలకీ ఏదో తేడా లీలగ కనిపిస్తోంది, ఆమెకు! ఆ బేధమేమిటో.... సరిగ్గా అవగాహన చేసుకోలేకపోతోంది.

"ఏమిటి వెర్రి ముఖమా? అలా చూస్తుండి పోయావు? పెరుగువెయ్యి." భర్త మందలింపుకు ఉలిక్కిపడి గబగబా పెరుగు వడ్డించింది.

ఆరోజు రాత్రి టి. వి.లో వార్తల ప్రసారమవు తున్నప్పుడు మధ్యలో 'సంఘసేవా' కార్యక్రమా లను చెపూ్త క్రిందటి రోజు సభనీ వక్తలనీ చూపించేరు.

భర్తా, కొడుకుతోపాటు ఆ దృశ్యాలన్నీ సౌభాగ్యలక్ష్మి కూడా చూసింది!

"చూసేవా మమ్మీ! డాడీ అంటే ఏమిటో తెల్సిందా?" అన్నాడు మధు ఇరవై సంవత్సరాల మధు అచ్చం సినీమాలో నటించి వచ్చిన కుర్ర సినీ హీరో పోజు పెట్టేడు.

"సరేలేరా! మీ డాడీ సంగతి నీకన్నా నాకే బాగా తెల్సు!"

"ఓయ్ ఓయ్! విన్నారా డాడీ? మమ్మీ ఎలా పొగిడేస్తోందో?" కనురెప్పలెగరేసేడు.

"ఇందులో పొగడడం ఏముందీ?"

"లేదా? ఏమిటి మమ్మీ ఈరోజు మాకాలేజీలో కూడా, రంగనాధ్."

"ఒరే మధూ! చాల్లే చిన్నపిల్లాడిలా ఏమిటీ? అది సరే రంగనాధ్ పొద్దేన్నే ఎందుకురా వచ్చాడు." రాజభూషణ చక్రవర్తిగార్కి పొద్దుటి సంగతి గుర్తు వచ్చింది.

"ఆ! ఏంలేదు డాడీ! మన వెనుక లాయర్ అంకుల్‌గారింట్లో ఓ పోర్షన్ ఖాళీ వుందిట! అయితే బాగా తెలుసున్న వాళ్ళకిగానీ ఆయన రెంట్‌కివ్వరు గదా? రంగనాధ్ వాళ్ళకి అర్జెంటుగా ఇల్లు కావాలట! మీరు ఓసారి లాయర్ అంకుల్‌కి రెకమెండ్ చేస్తారేమో అని అడగటానికి వచ్చాడు."

"మరి ఇంతవరకు ఉంటున్న ఇల్లు ఎందుకు ఖాళీ చేస్తున్నారు?" అని అడిగింది సౌభాగ్యలక్ష్మి.

"అద్దె మళ్ళీ పెంచమన్నాడుట వాళ్ళ ఓనర్!"

"ఊ! అద్దెకిచ్చేవాళ్ళకీ అద్దెకి వుండేవాళ్ళకీ మధ్య ఎప్పుడూ ఈ గొడవలు తప్పవు! మరి లాయర్‌గారు చాలా ఖచ్చితమైనవారు. నేను ఆయనకి రెకమెండ్ చేయాలంటే వాళ్ళని గురించి నాకు తెలియదు. తీరా ఇల్లు ఇప్పించేక ఏదైనా గొడవ వస్తే నాకూ, లాయర్‌గార్కీ మధ్య విబేధాలు రావచ్చును, అనవసరంగా ఆయనతో, నేను, మొహమాటం పోగొట్టుకోవాల్సి వస్తుంది."

"నో, నో డాడీ రంగనాధ్ వాళ్ళ అమ్మా, నాన్నా, చాలా మంచివాళ్ళు. నాకు తెలుసును. అద్దె పెంచలేక ఖాళీ చెయ్యాల్సి వస్తోంది అంతే. వాళ్ళు ఎవరితో పేచీలు పెట్టుకోరు చాలా నెమ్మదైన వాళ్ళు."

"ఆల్‌రైట్! రేపు నేను లాయర్‌గారితో మాట్లాడి రెంట్ ఎంత చెప్తారో కనుక్కుంటాను. మరి అంత వీళ్ళు ఇవ్వగలరా? ఇప్పుడు ఎంత ఇస్తున్నారుట?"

"ఐదువందలు ఇస్తున్నారు. ఒక్కసారే ఆరు వందలు చేయమన్నాట్ట! పైగా మిగతా వాళ్ళని అసలు అడగలేదుట! అందుకని పాపం! వీళ్ళకి చాలా బాధగా వుంది.

"ఊ సరే! లాయర్‌గారితో చెప్తాలే." అని లేచేరు రాజభూషణ చక్రవర్తిగారు.

అప్పుడు టి. వి లో నాటకమేదో వస్తోంది. అప్పటికి ఆ నాటకం నాల్గోసారి చూడాల్సి వస్తున్నందుకు విసుక్కుని మధు టి. వి ఆఫ్ చేశాడు.

వారం రోజుల తర్వాత,

రంగనాధ్‌వాళ్ళు లాయర్‌గారింట్లో అద్దెకు దిగేరు. ఒకవిధంగా చెప్పాలంటే రాజభూషణ చక్రవర్తిగారు గట్టిగా చెప్పడం వల్లనే లాయర్ గారు ఒప్పుకుని అద్దెకిచ్చేరు. ఆ విశ్వాసం ప్రకటించుకుందుకు రంగనాధ్ వాళ్ళ నాన్నగారు రాజభూషణ చక్రవర్తిగార్కి మాట ఇచ్చేరు. 'నాకు తెల్సున్న పెద్దమనుష్యుల్ని మీ 'సేవా సంఘ్'లో మెంబర్లుగా చేస్తానని!'

ఆ మాట చాలు తమ సంఘం శాఖోపశాఖలుగా విస్తరించిపోతున్నట్టు ఊహించుకుంటున్నారు. చక్రవర్తిగారు. ఆపైన మరీ బిజీగా ఆ కార్య క్రమాల సమాలోచనలోనే తిరుగుతూ ప్రముఖ వ్యక్తుల్ని కల్సుకుంటూ క్షణం తీరికలేకుండా వున్నారు.

ఓరోజు సాయంత్రం మునిమాపువేళ సౌభాగ్య లక్ష్మి పని అంతా తీర్చుకుని దేవుడి గదిలో దీపారాధన చేసి ధ్యానం చేసుకుంది. "ప్రభూ నీ చల్లని చూపే మాకు ఎల్లప్పుడు అండదండలు! ఇలాగే కాపాడు." అని భక్తితో నమస్కరించి బయటికి వచ్చింది.

సరిగ్గా అప్పుడే కరెంట్‌పోయింది.

తడుముకుంటూ వంటింట్లోనుంచి కొవ్వొత్తి తెచ్చి వెలిగించి హాల్లో పెట్టింది. ఇంట్లో ఎవరూ లేరు. భర్తా కొడుకు బయటికి వెళ్ళేరు.

మెల్లగా వరండా మెట్లు దిగి గేటు దగ్గర నిలబడింది. షాపింగ్ పూర్తిచేసుకుని ఇంటికి తిరిగివస్తోంది లాయర్‌గారి భార్య. అవతల సందు అని చెప్తున్నా వినిపించుకోని, ఆటోవాడు. ముందు సందులోకి తిప్పేడు. ఇంతలో సౌభాగ్యలక్ష్మి గేటు దగ్గర నిలబడివుండటం చూసి, "ఆపు ఆపు ఇక్కడే ఆపు" అని ఆపించింది ఆటో! వాడికి డబ్బు లిచ్చేసి పంపించి.

"ఏమిటీ ఇక్కడ నించున్నారు? కరెంటు పోయిందా?" వరండా వైపు చూస్తూ అడిగింది లాయర్‌గారి భార్య.

"అవునండి. రండి ఏమిటి బజారుకెళ్ళి వచ్చారా? ఇంత ప్రత్యేకించి ఇక్కడ దిగేరు ఏమిటి విశేషం?" అంది కొంచం ఆశ్చర్యంగా.

"ఆ! విశేషమని కాదు గానీ ఓ సంగతి చెప్దా మని మొన్నటినుంచి అనుకుంటున్నాను. ఎలాగు ఈ సందులోకి వచ్చాను గదా అని ఇక్కడే దిగేను."

"రండి లోపలికెళదాం!"

"అబ్బే అక్కర్లేదు నేను త్వరగా ఇంటి కెళ్ళాలి. ఒక్క నిముషం. ఇక్కడే చెప్తాలెండి. చూడండీ! మాకూ, మీకు వున్న స్నేహంవల్ల చక్రవర్తిగారి మాటమీదున్న గౌరవంవల్ల మేము వాళ్ళకి ఇల్లు అద్దెకిచ్చాం! అవునా?"

"అయ్యో ఎంతమాట? అంతే మరి. ఇంతకీ వాళ్ళేం చేసేరు?" సౌభాగ్యలక్ష్మి తెల్లబోతూ అడిగింది.

"అదే చెప్తున్నా. మనకి ఏదో డిగ్నిటీ అంటూ ఒకటుంది గదా? మన అంతస్థు మన ఉనికి చూసుకోవాలిగదా? ఎంత దయాగుణం వున్నా మరీ ఇంతగా స్థాయి దిగి రావడమా? ఆ రంగనాధ్ వాళ్ళమ్మ ఏం చేస్తుందో తెలుసా? ఇప్పటికి రెండుసార్లు చూసేను. మధ్యాహ్నం పూట చిన్న టిఫిన్ డబ్బాలో అన్నం పులుసు కలిపి ఓ సీసాలో నీళ్ళు తీసుకుని వెళ్ళి మన సందు అవతల ముష్టి వాడు లేడూ, వాడి గిన్నెలో వేసివస్తుంది. మరీ ఇంతలా ప్రకటించుకోవాలా జాలిగుణం? ఇంకా నయం తినిపించి రావటం లేదు అందుకు సంతో

షించాలి! ఇదేం పనండీ? ఈవారికి ఇంకా తెలియనివ్వలేదు నేను. లేకపోతే ఫలానా వాళ్ళ ఇంట్లో వున్న అద్దెకున్నవాళ్ళు, మరీ ఇంత చవక బారు మనుష్యులా అని అందరూ వింతగాచూడరూ? లాయరుగారి పరువేం కావాలి? ఏదో ఇంటి ముందుకు వస్తే, మిగిలిన నాడు ఇంత అన్నం పడేస్తాం గానీ ఇంత విడ్డూరమా? మళ్ళీ పెద్ద ఉద్యోగస్థుడి పెళ్ళాం కూడానూ? అందుకే మీకు చెప్తున్నాను. మీరొకసారి 'అదేమి పనమ్మా అలా వీధుల్లోపడి వెళ్ళి ముష్టివాడికి వెయ్యాలా? పెద్ద మనుష్యుల ఇంట్లోవుండి ఇలాంటి చిన్నపనులు చేయకూడద'ని మందలించండి! నేను డైరక్టుగా చెప్తే బాగుండదు. అదీ విషయం మరి నేను వస్తా.'' కంగారు కంగారుగా చెప్పి సౌభాగ్యలక్ష్మి భుజం మీద తట్టి వెళ్ళిపోయింది లాయర్‌గారి భార్య!

సౌభాగ్యలక్ష్మి అలా నిలబడిపోయింది!

ఎక్కడో, ఏదో, మేధస్సుకు ఇంతవరకు అందకుండా వున్న ఓ గొప్ప సత్యం అందిన అనుభూతి! భావమేకానీ భాషకి అందని కాంతి! ఎదలో సన్నని స్పందన కన్నులో పలచని నీటి పొర! పెదవుల్లో కంపన.

ఆ స్థితి నుంచి తేరుకున్న సౌభాగ్యలక్ష్మి మెల్లగా కదిలి ఇంట్లోకి నడిచింది.

పావుగంట తర్వాత రాజభూషణ చక్రవర్తిగారు ఇంటికి వచ్చారు. హాల్లో కొవ్వొత్తి ఎదురుగా కూర్చున్న సౌభాగ్యలక్ష్మిని చూసి ''కరెంట్ పోయిందా! ఎంతసేపైంది?'' అని అడిగేరు. ''చాలాసేపే అయింది'' సౌభాగ్యలక్ష్మి కంఠంలో నిర్వేదన తొంగిచూసింది.

''పోనీ ఇంకొక రెండు కాండిల్స్ వెలిగించక పోయావా? ఒక్కదానివీ అలా కూర్చున్నా వేమిటీ?''

''ఫర్వాలేదు ఈ వెలుగుచాలు మీరేమిటీ అంత అలసటగా కనిపిస్తున్నారు? కొంచం విశ్రాంతి తీసుకోకూడదూ? మరీ అంతగా తిరగాలా? కాళ్ళూ చేతులు కడుక్కోండి. హార్లిక్స్ కలిపిస్తాను.'' లేవబోయింది ఆమె.

''వద్దులే కూర్చో! కూర్చో!'' అంటూ భార్యని ఆపి తను కూడా సోఫాలో కూర్చున్నారు.

''సౌభాగ్యం! సాయంత్రం నుంచి నాకెందుకో మనస్సు బాగాలేదు. దానికి తోడు ఈ లైట్లు పోవడం ఒకటి.''

''ఏమైందండీ?'' ఆత్రుత ధ్వనించి ఆమె కంఠంలో.

''ఆ చందన్‌లాల్ మేడదగ్గరకి వెళ్ళేను. అక్కడ రంగనాథ్ కనిపించేరు. వాళ్ళ ఫ్రెండ్‌తో మాట్లాడుతున్నాడు. వాళ్ళు ఖాళీచేసి వచ్చిన ఇల్లు అదేనట! అంటే మాకోసమే చందన్‌లాల్ వాళ్ళందర్నీ ఖాళీ చేయించాడన్నమాట! ఆ సంగతి తెలియగానే రంగనాథ్ వాళ్ళ ఫ్రెండ్ ఎలా చూసేడనుకున్నావ్? అఫ్‌కోర్స్ నాకే ఎలాగో అనిపించిందనుకో.''

''ఏమండీ? నేను ఓ మాట చెప్పనా?'' కొన్ని క్షణాల తర్వాత సౌభాగ్యలక్ష్మి మెల్లగా అంది.

''చెప్పు సౌభాగ్యం!'

''జీవితంలో ఏదైనా మంచి పని చేయాలను కుంటే దానికి ఆర్భాటాలు ఆవేశాలు అక్కర్లే దండీ! మానవత్వం కలిగిన ఓ చిన్న సహాయం తోటివారికి చేస్తేచాలదా? పనికి మాలిన గుడ్డ పీలికలన్నీ కలిపి ఓ రవిక కుట్టి ఇచ్చాట్ట మన రత్తాలుకి వాళ్ళింటి పక్క దర్జీవాడు! పనిమనిషి రాకపోతే అన్నం మిగిలితే ఏం చేయనా అని ఆఖరికి దొడ్లో పడేసేను నేను ఎన్నోసార్లు. అంతే గానీ నాల్గు అడుగులు వేసి వెళ్ళి సందుచివర ముష్టివాడికి వేయాలని తోచలేదు. కాదు మన అంతస్థుకి తగని పని అని. చెయ్యం! కానీ రంగనాథ్ వాళ్ళమ్మగారు ఆ పని చేస్తుందిట! అది మహా నేరంలా ఇందాక లాయర్‌గారి భార్య నాకు చెప్పింది. ఏదో దేశానికి సేవచేయాలనీ పెద్ద ఎత్తున ప్రయత్నమేగానీ చిన్నమెత్తు చేయూత తోటివారికి ఇవ్వకూడదా? విత్తు నాటేను, చెట్టై విస్తరించేక ఎందరికో నీడ నిస్తుందని ఎదురుచూడమంటే ఈ ట్లోపులో ఎండలో మాడేవారి గతేమిటీ? మన చేతిగుడ్డ వారి నెత్తిమీద కప్పకూడదా?

> **మొటిమలు**
>
> యుక్త వయస్సులో ముఖం మీద మొటిమలు రావడం సహజం! వీటిని గిల్లరాదు. పుదీనా ఆకు రసాన్ని ముఖానికి రాత్రి పడుకో బోయేముందు రాసుకుని, పుదయం గోరు వెచ్చని నీటితో కడుక్కోవాలి. వారం రోజుల్లో మొటిమలు మటుమాయమవుతాయి.
>
> —మల్లిడి కనకరత్నం, ఆటపాక

''ఏమండీ నిజంగా సంఘసేవ చేయాలనుకుంటే సమాజాలు, సభలు అవసరమంటారా? ఆలోచించండి.''

సన్నని వెలుగు తీగలు కన్నులముందు జాలు వారినట్టు అనిపించింది రాజభూషణ చక్రవర్తిగార్కి.

కొన్ని రోజుల క్రితం రిక్షావాడు చేయగల్గిన పని కార్లు గలవాళ్ళుగానీ ఆటోలవాళ్ళుగానీ ఎందుకు చేయలేకపోయేరూ? కనీసం రోడ్డువార కూర్చునే కుష్టురోగికి కారు ఆపి పదిపైసలు వెయ్యాలను కోని తాను ఓ పెద్ద సంఘాన్ని స్థాపించాలనీ ఏదో దేశసేవ చేయాలనుకోడం ఎంత హాస్యాస్పదం? ఎందరికో అభయం ఇవ్వాలనుకుని హాయిగా వున్న కాపురస్థుల్ని మేడనుంచి ఖాళీ చేయించడానికి కారణభూతుణ్ణి అయాను. వేలదీపాలు వెలిగించా లనుకుంటున్నాను, కానీ కనీసం గోరంత వెలుగు ఎవరికి ఇవ్వగల్గుతున్నాను? అరుపు ఎక్కువ సరుకు తక్కువ. అంతకు తప్ప నేను ఏం గొప్ప పని చేయగల్గుతున్నాను? ఉపన్యాసాలవల్ల ఫోటోలు పూలదండలవల్ల ఎవరి కడుపులు నిండు తున్నాయి? ఎవరికి మేలు ఒరుగుతోంది? కనీస మానవతని కూడా నిల్పుకోలేని నాలాంటి వాళ్ళు కొండంత చీకట్లు పారద్రోలాలనుకోడం ఎంత సిగ్గుచేటు? పరువు హోదావదలలేని నేను సమాజ సేవ చేయగలనా? అవధులు దాటి రాలేని అభ్యుదయం ఉద్ధ దండగ.

ఇదంతా పైకి అనలేదు రాజభూషణ చక్రవర్తి మనసులో మాత్రమే అనుకున్నారు కానీ సౌభాగ్యలక్ష్మి ఆ మసక చీకట్లో సైతం భర్త భావాల్ని పసిగట్టగల్గింది!

''సౌభాగ్యం నిజమైన వెలుగేమిటో ఈ కొవ్వొత్తిని చూస్తుంటే తెలుస్తోంది! ఏమి చేసినా చేయలేకపోయినా రేపు మన మధుకి కట్నం తీసుకోకుండా కోడల్ని తీసుకువద్దాం!'' అన్నారు చిన్నగా నవ్వుతూ. తృప్తిగానవ్వింది సౌభాగ్యలక్ష్మి.

వారి నవ్వులు ఆ హాల్లో చిన్న చిన్న మెరుపుల్లా మెరిసేయి.

ఆ మర్నాడు పెరట్లో తులసి పూజ ముగించిన సౌభాగ్యలక్ష్మి ఇలా ప్రార్థించింది.

''తల్లీ నాలో ఎప్పుడూ మానవతా జ్యోతి వెలుగుతూ వుండేలా చేయి! కొండలు ఎత్తలేక పోయినా నల్గురూ నడిచేబాటలో, గుచ్చుకునేలా వుండే గులకరాళ్ళు ఏరి పారేయగల్గితే చాలు! ఆ బుద్ధిని నాకు ప్రసాదించు తల్లీ!'' □